
"కాఫీ ఇంకా కాలేదా?'' విసుగ్గా అడిగాడు శ్రీరామ్.

సింక్ ముందు నిలబడి హడావుడిగా అంట్లు తోమడం మొదలుపెట్టిన సునీతకి ఒళ్ళు మండిపోయింది. తను అయిదింటికి లేచింది. ఎనిమిది దాటాక లేచి తీరిగ్గా బ్రష్ చేసుకుని హాయిగా పేపర్ చదువుకుంటూ 'కాఫీ...కాఫీ' అని విసుగు ప్రదర్శిస్తున్న శ్రీరామ్‌ని చూస్తే తనమీద తనకే జాలి పుట్టి ఏడుపువచ్చేసింది.

# అసమర్థత



-మునిపల్లె లక్ష్మీరమణకుమారి

"పనమ్మాయి రాలేదు. అంట్లు తోముతున్నా'' అని తనూ విసుగ్గా అరిచింది.

మామూలు సమయంలో అయితే శ్రీరామ్ తనూ మళ్ళీ రెట్టింపు అరిచేవాడు. అది చిలికి చిలికి గాలి వాన అయ్యేది. ఆ తరువాత శ్రీరామ్ సునీతనీ, ఆమె ఏడుతరాల పెద్దల్నీ తిట్టిపోయడంతో ఆ సీన్ ముగిసేది. కానీ అసలే పనిమనిషిరాక, పని చేసుకోలేక ఏడుస్తున్న సునీతని కదిలించడం డేంజర్ అని తెలుసు కాబట్టి వెంటనే మొహంలో ఎక్స్‌ప్రెషన్స్ మార్చేసి సానుభూతిగా పెట్టుకుని తనే వంటింట్లోకి వచ్చి కాఫీ కలుపుకున్నాడు.

"పాపం... అసలే కొత్త ఆఫీసరు వచ్చాడు. తొందరగా వెళ్లాలి అని భయపడ్తున్నావు. ఇంతలో ఈపని కూడా వచ్చింది'' సానుభూతి చూపించాడు.

అతను కాఫీ తాగడం పూర్తి చేయగానే ఆటో హారన్ వినిపించింది.

"అదిగో బాబుకి ఆటో వచ్చేసింది'' అని గబగబా పిల్లాడి స్కూలు బ్యాగ్, వాటర్ బాటిల్, హాట్ ప్యాక్ వుంచిన బుట్ట వగైరా పట్టుకుని పరుగు తీసాడు. సునీత బాబుని ఎత్తుకుని వెనకే పరుగెత్తింది.

బాబుని ఆటో ఎక్కించి ఆటో వెళ్లిపోగానే శ్రీరామ్ తనూ బయలుదేరాడు సిగరెట్లు కొనుక్కురావాలని.

సునీత వెనక్కి తిరిగింది.

"పనిమనిషి రానట్టుందే?'' పక్కింటావిడ పలకరించింది 'నీ మొహానికి పనిమనిషి చేత పని రాబట్టుకునే స్కిల్‌లేదు' అన్న ఎక్స్‌ప్రెషన్ ఇస్తూ.

"అవునండీ'' నీరసంగా అంది సునీత.

ఇది పనిమనిషి మీనా ఈ నెలలో పెట్టిన ఏడో నాగా. పక్కింటావిడ పనిమనిషి మాత్రం రెగ్యులర్‌గా వస్తుంటుంది. రాకపోతే ఆవిడ జీతం కట్ చేసేస్తుంది. సునీతకు అలా చేయడానికి మనసొప్పదు. పోనీలే అని ఏ నెలకానెల మొత్తం జీతం ఇచ్చేయడం, మీనా యధాప్రకారం పని మానేయడం జరిగిపోతూనే వుంది. మీనా భర్త ఆమె సంపాదించినదంతా ఖర్చు పెట్టేసి కొడుతుంటాడుట. మీనా చెబుతుంటుంది.

పక్కింటావిడకి సునీతను చూస్తే ఎప్పుడూ నవ్వే. పనిమనుషులతో అనేక అనుభవాలు ఆవిడకి సునీత తెలివితక్కువతనం గురించి తెలిసేట్టు చేసాయి. వాళ్ళు సునీత దగ్గర అడ్వాన్సు తీసుకుని మళ్ళీ రాకుండా ఉన్న సంఘటనలు ఎన్నో. ఒకసారి ఒక పనిమనిషి ఉండేది. తన పిన్ని పోయిందనీ, చూసి వస్తాననీ వంద రూపాయలు తీసుకుని వెళ్లింది. మూడురోజులు రాననీ ఇప్పుడే వెళ్లిపోవాలి కాబట్టి



## కాపీ

''ఒరే శేఖర్! నువ్వు ఫెయిల యినందుకు ఇంటర్ బోర్డు వాళ్ళ మీద కంప్లైంట్ ఇచ్చావటగా!''

''అవునురా! నేను మేఘన ఆన్సర్ పేపరు చూసి కాపీ కొట్టాను. ఆమె ఫస్టుక్లాసులో పాసైంది. నేను ఫెయిల్ అయ్యాను. అందుకే కంప్లైంట్ ఇచ్చాను.''

## పండుగ

''ఒరే రమణా! పండక్కి అత్తగారింటికి వెళ్లావుగదా! ఏం పెట్టారురా!''

''అవీ ఇవీ అడుగుతున్నానని చీవాట్లు పెట్టారురా!''

– ఎస్.శివనారాయణ (కొత్తపేట)

## ప్రార్థన

''అదేమిటి సార్! ఆపరేషన్ చేసే ముందు అలా దేవుడికి దణ్ణం పెట్టుకుంటున్నారు?'' డాక్టర్ని ప్రశ్నించాడు పేషెంట్.

''కనీసం నీకు చేసే ఆపరేషన్ అయినా సక్సెస్ చేయమని ప్రార్థిస్తున్నాను'' చెప్పాడు డాక్టర్.

– పి.రవీంద్ర (హైదరాబాద్)



పని చేయనని చెప్పి వెళ్లిపోయింది. సునీత ఆఫీసుకి లేట్ అయిపోవడంతో సెలవు పెట్టి ఇంట్లో పని చేసుకుంది. ఎట్లాగో సెలవు పెట్టాం కదా, పోనీ షాపింగ్ అయినా చేద్దామని సునీత, పక్కింటావిడ బయలుదేరారు. ఆటోలో వెళ్తుంటే దారిలో సినిమా హాలు క్యూలో తల నిండా పూలు పెట్టి, మంచి చీర కట్టి పాన్ బిగించి నవ్వు మొహంతో నిలబడ్డ పనిమనిషి కనిపించింది. పక్కింటావిడ సునీతను చూసి కొంగు అడ్డం పెట్టుకుని నవ్వుతోంది. ఆవిడ ముందు తన అసమర్థత బయటపడ్డట్లయి సునీతకు ఎక్కడలేని కోపం వచ్చింది. తను ఫూల్ అయిందని బాధపడింది. అదే ఫ్లాష్‌బ్యాక్.

పక్కింటావిడ సునీతను చూసి అదోలా నవ్వుతోంది. ఇంతలో ఓ పాతికేళ్ళ యువతి వాళ్ల దగ్గర కొచ్చి నిలబడింది.

''మీనా పనిచేసేది ఇక్కడేనా?'' అడిగింది.

''అవును. మా ఇంట్లో చేస్తోంది. ఏం?''

''మీనా ఊరెళ్లింది. వచ్చిందాకా నన్ను చేయమని చెప్పింది.''

''అలాగా... రారా. నీ పేరేంటి?'' రిలీఫ్‌గా ఊపిరి పీల్చుకుంటూ లోపలకు తీసుకెళ్లింది.

''కాంచన'' జవాబిచ్చింది ఆమె.

''అవుగో అంట్లు. ఇదిగో బట్టలు. ముందు ఇల్లు చిమ్మి తుడిచెయ్యి'' అంటూ ఏమేం చెయ్యాలో చూపించింది. అయిదు నిముషాలయిన కాకుండానే ఆమె అంట్లన్నీ తోమి బోర్లించడం విని వెళ్లి చూసింది. ఒక్క పాత్రా సరిగ్గా తోమలేదు.

''ఏంటి అట్లా తోమావు?'' కంగారుగా అడిగింది.

''ఇంకెలా తోముతారు?'' విసుగ్గా అడిగింది కాంచన.

''ఒక్కటీ సరిగ్గా తోమలేదు.''

''బాగానే వున్నాయి. ఇంతే. ఇంతకన్నా తోమక్కర్లేదు'' విసురుగా గిన్నెలన్నీ లోపలకు తెచ్చేసి ధన్ మంటూ కిందపెట్టింది.

గబగబా చీపురు తీసుకుని ఇల్లంతా తిరిగింది కాంచన. అంతే. ఇల్లు చిమ్మడం అయిపోయింది. అక్కడ్నుంచీ బాత్రూమ్‌లోకి పరుగెత్తి బట్టలన్నీ రెండు బక్కెట్లు నీళ్లతో ఉతికిపారేసింది. కాంచన తోమే వ్యవహారం చూస్తే పని చేస్తున్నట్లు కాకుండా శత్రుసైన్యం మీద దాడి చేస్తున్నట్లుంది. ఏం జరుగుతోందో తెలిసేలోపలే అంతా జరిగిపోతోంది.

''ఏంటలా చూస్తావు? చాయ్ కలిపి ఇవ్వు'' దబాయిస్తున్నట్లుగా అంది కాంచన. సునీత అయోమయంగా చూస్తూ టీ కలిపి ఇచ్చింది.

''టీవీ పెట్టు'' కాంచన ఆజ్ఞాపించింది.

టీవీ చూస్తూ విలాసంగా టీ తాగేసి సింక్‌లో ఆ గ్లాసుని విసిరికొట్టి వెళ్లిపోయింది కాంచన.

ఇంతలో పక్కింటావిడ ఇంట్లోకి జొరబడింది.

''అదెవరండీ? మీరు ఇంతకుముందు చూసారా? ఎవరో ఏంటో తెలీకుండా ఇంట్లోకి రానిచ్చారు?'' అంది.

''మా మీనా పంపిందిటండీ. ఊరికి వెళ్తూ ఈమెని మా ఇంట్లో పని చూసుకోమని చెప్పిందిట.''

''అవునూ. మీ మీనా ఆ ఎదురింట్లో కూడా పని చేస్తుందిగా. మరి వాళ్లింటికి వెళ్ళమని ఎందుకు చెప్పలేదుట!''

''ఏమో మరి!''

''ఏమిటండీ మరీ ఇలా ఉంటారు? అసలు ఎవరో ఏమిటో తెలీకుండా ఇంట్లోకి ఎలా రానిచ్చారు? అదేం చెబితే అది నమ్మడమేనా? ఏ కత్తో చూపించి నగలూ, డబ్బూ తీసుకుని ఉడాయించిందంటే...? ఎన్ని వినడంలేదు కనుక?''

''అవుననుకోండి... కానీ...''

''కానీ లేదు, దమ్మిడిలేదు సునీతగారూ! మీ అమాయకత్వం చూస్తుంటే...'' పక్కింటావిడ మళ్ళీ నవ్వింది.

సునీతకి భయం మొదలైంది. కాంచన తీరు చూస్తుంటే అనుమానాస్పదంగానే తోచింది. పని చెయ్యడానికి వచ్చిన మనిషైతే మరి తీరుగా పని చేయాలి కదా. గబగబా పని చేసినట్లు చేసి ఏదన్నా ఎత్తుకు పోవడానికే వచ్చినట్టుంది. మీనా రాని సంగతి కనిపెట్టి ఇంట్లో దూరిందేమో! గబగబా లోపలకు వెళ్లి అన్నీ ఒకసారి చూసుకుంది.

అమ్మయ్య... ఏమీ ఎత్తుకుపోయినట్టులేదు. గబగబా తయారై ఆఫీసుకు వెళ్లింది.

★★★

మర్నాడు మళ్ళీ మామూలే. ఎనిమిదయినా మీనా రాలేదు. మళ్ళీ కాంచనే వచ్చింది.

''మీనా రాలేదా?'' కోపంగా అడిగింది సునీత.

''లేదు. జరుగు'' అంటూ సునీతను తోసుకుని లోపలకు వచ్చింది కాంచన. సునీతకి ఒళ్ళు మండిపోతోంది. మీనా ఊరు ఇక్కడికి చాలా దగ్గర. నిన్న రాత్రికి తిరిగి వచ్చేస్తుందని అనుకుంది.

''నాకు చెప్పకుండా వెళ్లిందేమిటి?''


''నాకు చెప్పిందిగా'' నిర్లక్ష్యంగా జవాబిచ్చింది కాంచన. కాంచన చూపులు, మొహం అన్నీ ఆరో మాదిరిగా ఉన్నాయి. సందేహంలేదు. ఇదోక దొం...

''మీనా ఎప్పుడొస్తుంది?''

''ఎప్పుడొస్తే నీకేం? నేను చేస్తున్నానుగా?''

''నువ్వు బాగా చేయడంలేదు.''

''నాకు తెలీదు. మీనా నన్ను చేయమంది చేస్తున్నా.''



"ఖర్మ" అనుకుంటూ వంట పనిలో పడింది సునీత.

***

ఆ మర్నాడూ కాంచనే వచ్చేసరికి సునీతకి కోపం ఆగలేదు. "మీనా ఇంకా రాలేదా?"

"వచ్చింది."

"మరి పనికి రాలేదేం?"

"నేనొచ్చానుగా!"

"నువ్వొద్దు. బాగా చేయడంలేదు."

"పని చేసిపోతా" సునీతను నెట్టుకుంటూ జబర్దస్తీగా లోపలకు వచ్చి యథాప్రకారం తనదైన స్టైల్‌లో చేసేసింది కాంచన.

ఇంతలో పక్కింటావిడ మళ్లీ వచ్చింది.

"ఇది ఖచ్చితంగా ఏదో మోసమేనండీ. లేకపోతే ఎవరూ దీనిచేత పని చేయించుకోవడం లేదేమో! ఏడిసినట్లు చేస్తోందంటున్నారుకదా. మీరైతే ఎలా చేసినా చేయించుకుంటారని దాన్ని ఇక్కడ కుదిర్చి తను కమీషన్ తీసుకుంటోందేమో మీ మీన!" అంది జాలిగా చూస్తూ. సునీతకు ఒళ్ళు మండిపోయింది.

పక్కింటావిడ చెప్పింది నిజమేలా వుంది. అయినా తను వీళ్ళ చేతిలో ఫూల్ అయ్యేందుకు సిద్ధంగా లేదు. కాంచనకు టీ ఇవ్వలేదు.

"చాయ్ ఏదీ?"

"పెట్టలేదు."

"ఏం?"

"నాకు కుదరదు. ఇదిగో ఖచ్చితంగా చెప్తున్నాను విను. నువ్వు రావడానికి వీల్లేదు. రేపు నువ్వొస్తే తలుపు తెరవను. ముందుగా చెప్తున్నాను రాకు."

"సరే పో" అనేసి బయటకు నడిచింది కాంచన.

"ఎవరుచేస్తే ఏం? పని కావాలి. అంటే ఎవరూ లేకుండా ఉంటే ఎలా?" శ్రీరామ్ అన్నాడు.

"మీకెంటీ మధ్యలో?"

"నాకేంటా? నువ్వే చేసుకోవాలనేసరికి ఆ కోపమంతా నామీద చూపిస్తావేమోనని భయం అంతే."

"మీరేమన్నా సాయం చేస్తారా ఏమన్నానా? మీ కాఫీ టిఫిన్లన్నీ వేళకు జరుగుతున్నాయి. భయపడకండి" అంది సునీత.

అప్పట్నుంచీ మొదలైంది టెన్షన్.

మీనా ఊళ్ళోనే ఉండి ఎందుకు రాలేదు మరి? మీనా వస్తుందా రాదా? ఎన్నడూ లేనిది ఈసారి ఎందుకు తనకు బదులు ఇంకోర్ని పంపింది? కాంచన నిజంగా మీనాకు చుట్టమా కాదా? కాంచన ప్రవర్తన ఎందుకు అదోలా వుంది?

మీనా రానీ. ఈసారి నుంచీ జీతం శుభ్రంగా కట్ చేసి చేసిన రోజులకి మాత్రం లెక్కకట్టి చేతిలో పెడితేసరి. మర్నాటిదాకా సస్పెన్స్ కొనసాగింది.

***

తెల్లవారింది. కాలింగ్‌బెల్ మోగింది.

ఒక్క దూకులో వెళ్లిడోర్ ఐలో కన్ను పెట్టిచూసింది కాంచన అయితే తలుపు తెరవకూడదనీ, మీనా రాకపోతే 'నేనే చేసుకుంటాలే పో' అందామనీ అనుకుంది. మీనా ఆకారం అస్పష్టంగా కనిపించింది. తలుపు తెరిచింది. ఎదురుగా మీనా, మొహంలో దిగులు.

"ఏంటి ఊరెళ్లావుట?"

"అవునమ్మా" మీనా లోపలకు నడిచి పనిలో జొరబడింది.

"అదోలా వున్నావేం? ఊరికి ఎందుకు వెళ్లావు?" సునీత అడిగింది.

"అదంతా పెద్ద కథమ్మా. అనుకోకుండా వెళ్లాల్సి వచ్చింది. మా అక్క హాస్పిటల్‌లో వుందమ్మా. ఒళ్ళు కాల్చుకుంది. మొగుడు సతాయిస్తాడు, కొడతాడు. భరించలేక కాల్చుకుంది."

"అయ్యో అలాగా!"

"అవునమ్మా. కబురు రాగానే బయల్దేరాం. అందుకే మీకు చెప్పేందుకు కుదరలేదు. మిగతా ఇళ్లల్లో అందరూ జీతం కట్ చేసుకుంటారు. కానీ మీరు కట్ చేయరు. ప్రతినెలా చాలా రోజులు రాకపోవడం నాకే బాగనిపించలేదు. మీరు ఇంట్లో, ఆఫీసులో పని చేసుకోవాలి. అందుకే మా ఇంట్లో వచ్చిన ఆ చుట్టాలామెను మీ ఇంట్లో చేయమని చెప్పాను. అది ఒక మెంటల్‌దమ్మా. ఆమె అందంగా లేదని మొగుడు ఇంకో పెళ్లి చేసుకున్నాడు. అప్పట్నుంచీ అదోలా తయారయింది. మీరు మెల్లగా చెప్పి చేయించుకుంటారులే అనుకున్నా. అసలు లేనిదాని కన్నా ఎవరో ఒకరు చేస్తారు కదా అనుకున్నాను" అంది మీనా.

సునీతకు తల తిరుగుతున్నట్లనిపించింది. తనెంతసేపూ తన గురించే ఆలోచించింది కానీ ఎదుటి వ్యక్తి గురించి ఆలోచించలేదు. తను ఇంత అనుమానించి, భయపడింది ఆఖరుకి ఒక అభాగ్యురాలి గురించా? మీనా, ఆమె అక్క ఎన్ని కష్టాలు పడుతున్నారు? తను ఆఫీసులో లేడీస్ క్లబ్‌కి ప్రెసిడెంట్. తమ క్లబ్ తరఫున నెలలో ఆదివారం మురికివాడలకి వెళ్లి ఏదన్నా సర్వీస్ చెయ్యాలని తీర్మానించుకున్నారు కూడా. కానీ... ఇంట్లో పనిమనిషి కష్టం ఏమిటో తెలుసుకోలేని తను బయట ఎవర్ని ఉద్ధరిస్తుంది? ఎవర్నో ఉద్ధరించడం సరే. ముందు తన సంగతేంటి? గతేంటి? ఎంత సంపాదించినా, చాకిరి చేసినా ఏమాత్రం విలువ ఇవ్వకుండా భర్త తనను హీనంగా చూస్తుంటే ఏం చేయగలుగుతోంది?

అప్పుడు గుర్తొచ్చింది... మాటలు చెప్పడం తేలిక... ఆచరణ కష్టం అని.

★



## ముద్దుల పోటీ

కెనడాలో ఓ విచిత్రమైన పోటీ పెట్టారు నిర్వాహకులు. అది మరేమిటో కాదు ముద్దుల పోటీ. యథాశక్తిగా ఎవరికి వారు నోళ్ళు నొప్పెట్టేలా ముద్దు పెట్టుకోవాలి. ఎవరు ఎక్కువసేపు నాన్‌స్టాప్‌గా ముద్దు పెట్టుకుంటారో వాళ్ళకు ఒక రోజంతా స్టార్ హోటల్‌లో డిన్నర్, డాలర్లతో నింపిన పర్సు బహుమతిగా ఇస్తారు. ఇంకేముంది... అంతా ఒకటే హడావుడి. ఆ పోటీలో నూట ఇరవై నిముషాలపాటు నోరు నొప్పి పెట్టినా నాన్‌స్టాప్‌గా ముద్దులు పెట్టుకుని ప్రైజ్‌ని, స్టార్‌హోటల్లో డిన్నర్‌ని గెలుచుకుంది కెలోరినా అనే అమ్మడు.

తీరా చూస్తే ఆవిడ అంతోసేపు ముద్దుల్లో ముంచెత్తింది మొగుడ్ని కాదు బోయ్‌ఫ్రెండ్‌ని.

– శశి

